క్లుప్తంగా

వెయ్యి మందికి ప్రోత్సాహకాలిస్తాం

అమలాపురం టౌన్: జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతూ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్(ఎన్ఎంఎంఎస్) కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన 1,000 మంది విద్యార్థులకు పరీక్ష ఫీజు చెల్లించడమే కాకుండా వారికి ఉపయుక్తమయ్యే స్టడీ మెటీరియల్ కూడా అందజేయనున్నట్లు రాజ్‌కమల్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు యర్రమిల్లి జయరామ్ తెలిపారు. గతేడాది జిల్లాలో దాదాపు 400 మంది విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పరీక్ష ఫీజు చెల్లించి ఉచిత స్టడీ మెటీరియల్ సమకూర్చామన్నారు. మరిన్ని వివరాలకు పరీక్ష రాస్తున్న విద్యార్థులు 99890 27829 ఫోన్ నెంబరులో సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

డేవిడ్ రాజుకు సత్కారం



కూనవరంలో డేవిడ్‌రాజును సత్కరిస్తున్న సర్పంచ్ ఈశ్వరి దంపతులు

ఉప్పలగుప్తం: మండలంలోని కూనవరం జీవము గల దేవుని సంఘం చర్చి పాస్టర్ పండు డేవిడ్ రాజును ఆదివారం సర్పంచ్ వాకపల్లి ఈశ్వరి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పాస్టర్ డేవిడ్ రాజు ఈ నెల 11వ తేదీ నుంచి వారం రోజుల పాటు మలేషియా, దుబాయ్ దేశాల్లో జరిగిన అంతర్జాతీయ సెమినార్లలో పాల్గొని స్వదేశానికి వచ్చిన సందర్భంగా డేవిడ్ రాజును సర్పంచ్ ఈశ్వరి సత్యనారాయణ దంపతులు అభినందించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు పొద్దూకు సత్యానందం, శ్రీధర్, జాలెం శ్రీరామమూర్తి, వడ్డి కిషోర్‌బాబు, వాకపల్లి సన్నిబాబు, పండు శ్రీరామ్మూర్తి, వడ్డి సత్యవతి, పరమట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సాగునీరివ్వాలి

యానాం: దరియాలతిప్ప ఆయకట్టుపరిధిలో ఇటీవలి కురిసిన భారీవర్షాలకు తోడు గోదావరి వరదలకు నారుమడి వేసిన చేలు పూర్తిగా మునిగిపోయాయని, అనంతరం తిరిగి నాట్లు వేసుకుంటే పంట కాలువలో నీరు లేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణం గోదావరి నుంచి సీతారామనగర్ వద్ద ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థ ద్వారా కాలువల్లోకి నీరు మళ్లించాలని ఆదివారం పలువురు రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై పీడబ్ల్యూడీ అధికారులు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘ అధ్యక్షుడు తిరుకోటి భైరవమూర్తి, సబ్బతి లోకేశ్వరరావు, రాంబాబు, మట్టా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దేశంలోనే 39వ స్థానం గర్వకారణం

యానాం: కేంద్ర విద్యాశాఖ ఇటీవల విడుదల చేసిన ర్యాంకింగ్ జాబితాలో పుదుచ్చేరి జిప్‌మెర్ దేశంలోనే 39వ స్థానాన్ని సాధించించడం గర్వకారణమని పుదుచ్చేరి రాష్ట్ర పీపుల్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఎం.రామదాసు పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిప్‌మెర్ ఆసుపత్రికి మెరుగైన స్థానం లభించడం మంచి విషయమేనని, అయితే 100 ఇంజినీరింగ్ కళాశాలల్లో పుదుచ్చేరి కాలేజీలేవీ లేకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఉన్నత విద్యలో నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ప్రభుత్వం సాంకేతిక విద్యాభివృద్ధికి బోధన అభ్యసనా సౌకర్యాలను కల్పించాలని కోరారు.

బాధిత కుటుంబాలకు ఎంపీ పరామర్శ

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ పాతకోరంగిలో దళిత నాయకుడు వెంటపల్లి చంద్రమౌళి ఇటీవల మృతి చెందారు. అమలాపురం ఎంపీ హరీష్ మాథుర్ ఆదివారం ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే గోవలంక, చినగోవలంక గ్రామాల్లో పలు బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట ఉంగరాల వెంకటేశ్వరరావు, చెల్లె అశోక్, జక్కల ప్రసాద్, టేకుమూడి లక్ష్మణరావు, రోళ్ల చక్రవర్తి, మోపూరి వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

రైల్వే రిజర్వేషన్ కౌంటర్ పునరుద్ధరించాలి

కొత్తపేట: జిల్లా కేంద్రమైన అమలాపురంలో రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను పునరుద్ధరించాలని పలువురు కోనసీమ వాసులు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆమేరకు కొత్తపేటకు చెందిన ఆర్యవైశ్య సంఘం, వర్తక సంఘం నాయకుడు తమ్మన సాయిప్రసాద్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేసి ఎంపీ గంటి హరీష్‌మాథుర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎంతో కాలం క్రితమే అమలాపురం పట్టణంలో ఒక రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ఉండేదన్నారు. ఈ ప్రాంత ప్రయాణకులు ఎంతో సులువుగా రైల్వే ప్రయాణాలకు ఆ కౌంటర్‌ను వినియోగించుకున్నారని పేర్కొన్నారు. సుమారు రెండేళ్ల క్రితం ఆ కౌంటర్‌ను తొలగించి, హెడ్ పోస్టాఫీస్‌కు మార్చారని సాయిప్రసాద్ గుర్తు చేశారు. దాంతో సేవలు పరిమితం కావడం, సెలవు దినాల్లో రిజర్వేషన్ సౌకర్యం లేకపోవడంతో రైల్వే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. టిక్కెట్ల సమాచారం, టిక్కెట్లు రద్దు చేసుకోవాలన్నా రాజమహేంద్రవరం వెళ్లాల్సి వస్తోందన్నారు. ఈ ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని, రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం తిరిగి రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటుకు ఎంపీ హరీష్‌తో పాటు జిల్లా మంత్రి వాసంశెట్టి సుభాష్, కోనసీమ ఎమ్మెల్యేలు కృషి చేయాలని కోరారు.

హే బిడ్డా.. ఇది మా అడ్డా..

- పట్టణంలో రహదారులపైనే పశువుల సంచారం
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- అదుపు చేయలేకపోతున్న మున్సిపాలిటీ అధికారులు





అమలాపురం పట్టణంలో రోడ్డుపై సంచరిస్తున్న ఆవులు

అమలాపురం టౌన్: ఒకటి కాదు.. రెండు కాదు.. పదుల సంఖ్యలో పశువులు నిత్యం రోడ్లపైనే సంచరిస్తున్నాయి. రాత్రి పగలు అన్న తేడా లేకుండా నడిరోడ్డుపైనే మకాం పెట్టేస్తున్నాయి. ఫలితంగా రోజూ పట్టణంలోని ఏదోచోట వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్లపై సంచరించడమే కాదు అకస్మాత్తుగా వాటిలో అవే పోట్లాడుకొని అటుగా వెళ్లే వాహనదారులపై పడడంతో తీవ్ర గాయాలపాలవుతున్న ఘటనలు సైతం చోటుచేసుకుంటున్నాయి. రోడ్లపై పశువులను వదిలేస్తే చర్యలు తప్పవని మున్సిపల్ అధికారులు ఎన్నిసార్లు హెచ్చరిస్తున్నా పశువుల యజమానుల్లో మాత్రం మార్పు రావడం లేదు. రోజూ ఉదయమే పశువులను తీసుకొచ్చి పాలు పితుక్కుని మళ్లీ రోడ్లపై వదిలేస్తున్నారు. పశువులను పట్టుకుంటే మాత్రం మరోసారి ఇలా జరగకుండా చూసుకుంటామని చెప్పి పశువులను ఇంటికి తీసుకెళుతున్నారు. ఆ తరువాత కథ మళ్లీ మామూలే.. మున్సిపాలిటీ అధికారులు సైతం వాటిని తీసుకొస్తే ఎక్కడ ఉంచాలోనని, మేత ఖర్చు ఎవరు భరిస్తారన్న భయంతో వదిలేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని అమలాపురం పట్టణ ప్రజలు కోరుతున్నారు.

✤ మూడు నెలల క్రితం అమలాపురం వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద 216 జాతీయ రహదారిపై ఒక వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. రోడ్డుపై ఆవులు నిద్రిస్తుండడంతో వాటిని తప్పించుకుని వెళుతుండగా అవి ఒక్కసారిగా పైకి లేచి వాహనాన్ని ఢీకొన్నాయి. దీంతో అతడు రోడ్డుపై పడిపోయి తీవ్ర గాయాలపాలయ్యాడు.

✤ నాలుగు నెలల క్రితం అమలాపురం పట్టణంలోని కలశం సెంటర్ సమీపంలో మోటారు సైకిల్‌పై వెళుతున్న ఇద్దరు వ్యక్తులను ఆవులు ఢీకొనడంతో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. దీంతో వారిద్దరినీ స్థానికంగా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందించారు.

✤ నెల రోజుల క్రితం గుర్రాల బండ్ల సెంటర్‌లో రాత్రి సమయంలో రోడ్డుపై ఆవులు అడ్డు రావడంతో ద్విచక్రవాహనంపై వెళుతున్న ముగ్గురు యువకులు కింద పడిపోయారు. వారికి తీవ్ర గాయాలవ్వడంతో స్థానికంగా ఆసుపత్రిలో చేర్చారు. నిత్యం ఇలా ప్రమాదాల బారిన పడుతున్న వారి సంఖ్య అధికంగానే ఉంటుంది.

✤ ఇలాంటి రోడ్డు ప్రమాదాలను కొంతలో కొంత అదుపు చేసే ఉద్దేశంతో స్థానిక ఆజాద్ ఫౌండేషన్ ప్రతినిధులు రాత్రి సమయంలో కూడా రోడ్లపై ఉన్న ఆవులను వాహన చోదకులు గుర్తించేలా రేడియం స్టిక్కర్లు అతికించారు.

ప్రశ్నిస్తున్నా ఫలితం లేదాయె

అమలాపురం పట్టణంలో దాదాపు 250కి పైగా ఆవులు రోడ్లపై సంచరిస్తున్నట్లు అంచనా వేస్తున్నారు. ఎనిమిది వరకూ ఆబోతులు తరచూ వీరంగం చేస్తూనే ఉంటాయి. ఆబోతులు దెబ్బలాడుకుంటూ అవి సృష్టించే వీరంగానికి చిరు వ్యాపారులు నష్టపోవడమే కాకుండా పలువురు గాయపడిన ఘటనలు కూడా ఉన్నాయి. నిత్యం ఏదొక ప్రమాదం జరుగుతున్నా మున్సిపాలిటీ అధికారులు మాత్రం ఆరంభ శూరత్వంలా పశువుల యజమానులకు కటాఫ్ డేట్లు ఇచ్చి హెచ్చరిస్తున్నారే తప్ప వారిపై పూర్తి స్థాయి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. పలు కౌన్సిల్ సమావేశాల్లో కొందరు సభ్యులు రోడ్లపై సంచరిస్తున్న ఆవుల సమస్యపై ప్రశ్నిస్తున్నా చర్యలు మాత్రం శూన్యం. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు దీనిపై సీరియస్‌గా చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు. ఆవుల యజమానులు మున్సిపాలిటీ హెచ్చరికలను ఖాతరు చేయకపోతే ఆవులను బంధించి వాటిని హైదరాబాద్ లాంటి సుదూర ప్రాంతాల్లో ఉన్న గోశాలలకు తరలించే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

గోశాలలకు తరలించడమే పరిష్కారం



రోడ్లపై తిరుగుతూ ప్రమాదాలకు కారణమవుతున్న ఆవులను ఒకేసారి బంధించి గోశాలలకు తరలిస్తేనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. లేదా తమ ఆజాద్ ఫౌండేషన్ కొన్ని ఆవులకు రేడియం స్టిక్కర్లు వేసినట్లే మున్సిపాలిటీ సిబ్బంది మొత్తం ఆవులను గుర్తించి స్టిక్కర్లు వేయాలి.

– యల్లమిల్లి నాగసుధాకొండ, వ్యవస్థాపక అధ్యక్షుడు, ఆజాద్ ఫౌండేషన్, అమలాపురం

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్మోహన్

అమలాపురం టౌన్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు స్థానిక యూటీఎఫ్ హోమ్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్మోహన్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్వాతంత్ర్య సమర యోధుల స్ఫూర్తిని స్మరించుకుంటూ వ్యాస రచన, చిత్ర లేఖనం పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచారన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ సీనియర్ నాయకుడు టీఎస్ రావు, రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కె.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పరదేశమ్మ తీర్థం



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న పరదేశమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్లు

తాళ్లరేవు: తాళ్లరేవు గ్రామదేవత పరదేశమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. శనివారం రాత్రి అమ్మవారి పెద్ద జాతర ఘనంగా నిర్వహించారు. స్థానిక మార్కెట్ వీధిలోని అమ్మవారి అంగస్‌గుడి నుంచి ఆలయానికి కొత్త అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లారు. గరగ నృత్యాలు, వివిధ రకాల వేషధారణలు, బొమ్మల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాళ్లరేవు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు సమర్పించుకున్నారు. తీర్థంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరక్కుండా కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

లోఓల్టేజీతో గృహ వినియోగదారులకు ఇక్కట్లు



అలంకారప్రాయంగా మారిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

అల్లవరం: దేవగుప్తం పంచాయతీ పరిధిలోని కర్రిచెరువులో రెండు నెలలుగా లోఓల్టేజీ సమస్య ఉన్నా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండున్నర నెలల క్రితం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే దాని స్థానంలో వేరే ట్రాన్స్‌ఫార్మర్ అమర్చారని గ్రామస్తులు తెలిపారు. ఇది కేవలం పదిహేను రోజులు మాత్రమే పని చేసిందన్నారు. రెండు నెలలుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అలంకారప్రాయంగా మారాయన్నారు. విద్యుత్ వినియోగం అంతగా లేకపోయినా లోఓల్టేజీతో బల్బులు, ఫ్యాన్లు పని చేయడం లేదని వాపోయారు. దీనిపై ట్రాన్స్‌కో ఏఈకి ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని గ్రామస్తులు ఆవేదన చెందారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ఈతకోట రాజు, ఊటాల పవన్, కలగట నాని, ఊటాల సురేష్, ఊటాల వెంకటలక్ష్మి, ఈతకోట పద్మ తదితరులు కోరారు.

గ్రామీణ క్రీడాభివృద్ధిపై దృష్టి పెడదాం



సమావేశంలో మాట్లాడుతున్న క్రీడా భారతి జిల్లా అధ్యక్షుడు శరత్

అమలాపురం టౌన్: గ్రామీణ క్రీడాభివృద్ధిపై దృష్టి పెట్టి ప్రణాళికాబద్ధంగా క్రీడలను ప్రోత్సహించాలని క్రీడాభారతి జిల్లా అధ్యక్షుడు అల్లాడ శరత్ అన్నారు. స్థానిక దుడ్డివారి అగ్రహారంలోని ఆఫీసర్స్ రీక్రియేషన్ క్లబ్‌లో ఆదివారం జరిగిన జిల్లా క్రీడా భారతి సర్వసభ్య సమావేశానికి శరత్ అధ్యక్షత వహించి ప్రసంగించారు. ఈ సందర్భంగా గ్రామీణ క్రీడాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, తయారు చేయాల్సిన ప్రణాళికలపై చర్చించారు. అనంతరం సౌత్ ఇండియా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ డిసిప్లినరీ కమిటీ చైర్మన్‌గా ఎంపికైన వంటెద్దు వెంకన్నాయుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దొమ్మేటి వెంకటరమణ, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంత్రి సుభాష్, జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న వ్యాయామ ఉపాధ్యాయులు ఐ.భీమేష్, విష్ణు ప్రసాద్, పురుషోత్తం, నాగ దుర్గ, అబ్బులు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎ.విజయ శ్రీనివాస్‌లను సత్కరించారు.

భారత్ బంద్‌కు మద్దతివ్వాలి



మాజీ మంత్రి విశ్వరూప్‌తో మాట్లాడుతున్న మాలమహానాడు జేఏసీ నాయకులు

అమలాపురం రూరల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా ఈనెల 21వ తేదీన దళిత సంఘాలు నిర్వహించనున్న భారత్ బంద్‌కు మద్దతివ్వాలని ఎంపీ గంటి హరీష్ మాథుర్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్‌లను జిల్లా మాలమహానాడు జేఏసీ నాయకులు కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా మాలమహానాడు జాతీయ నాయకులు పండు అశోక్‌కుమార్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగానికి పూర్తి విరుద్ధంగా ఉందన్నారు. తక్షణమే సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జగడం సత్యనారాయణ, ఎంఏకే భీమారావు, పెయ్యల పరుశురాముడు, జల్లి శ్రీనివాసరావు, ఉండ్రు బాబ్జి, నాతి శ్రీనివాసరావు, చీకురుమెల్లి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.


బ్రహ్మార్పణ్ పథకానికి అవార్డు



ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకుంటున్న తాళ్లరేవు లయన్స్ క్లబ్ ప్రతినిధులు

తాళ్లరేవు: ఎటువంటి ఆదరణ లేని అభాగ్యులకు ఫీడ్ ది హంగర్ సేవా కార్యక్రమంలో భాగంగా తాళ్లరేవు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొప్పిశెట్టి లక్ష్మయ్య బ్రహ్మార్పణ్ పథకానికి వరుసగా రెండోసారి ఉత్తమ సేవా పురస్కారం లభించింది. స్థానిక సూర్య భాస్కర కల్యాణ మండపంలో జరిగిన 2023–24 లయనిస్టిక్ అవార్డు ఫంక్షన్‌లో లయన్స్ జిల్లా గవర్నర్ వేలూరి సూర్యనారాయణ చేతుల మీదుగా తాళ్లరేవు లయన్స్ క్లబ్ ప్రతినిధులు అవార్డు అందుకున్నారు. రెండోసారి అవార్డు రావడంపై క్లబ్ ప్రతినిధులు బి.శ్రీనివాసరెడ్డి, పొన్నాడ పేరయ్యరాజు, కె.బాబీ, శ్రీనివాస్, మాల తీవసుందర, కె.ఆదినారాయణ, దత్తు, అప్పారావు తదితరులు సంతోషం వ్యక్తం చేశారు.

✦ చిత్రం చెప్పే సంగతులెన్నో..



సంధ్యా సమయంలో గౌతమీ గోదావరి అద్భుత దృశ్యం

నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

యానాం: మనిషి జీవన ప్రస్థానంలో రోజూ ఓ మధుర జ్ఞాపకం. ప్రతి మలుపును పదిలంగా కళ్ల ముందుంచేది ఫొటో. ఒక్క చిత్రంలో వేల భావాలు దాగుంటాయి. మారుతున్న రూపాన్ని జీవితాంతం కళ్లకు కడతాయి. ప్రతి ఫొటో వెనుక ఒక జ్ఞాపకం, అనుభూతి ఉంటాయి. పుట్టిన రోజైనా, టూర్‌కు వెళ్లినా ఇలా ఎక్కడ ఏం జరిగినా అక్కడ ఆ జ్ఞాపకాలను పదికాలాల పాటు పదిలంగా ఉంచేందుకు ఫొటో దోహదపడుతుంది. ఫొటోగ్రఫీ రంగంలో వచ్చిన ఆధునికత డిజిటల్ ప్రక్రియతో ప్రస్తుతం పెళ్లికి ముందు అందమైన లొకేషన్లలో ప్రీ వెడ్డింగ్ షూట్ జరుపుకోవడం సర్వసాధారణమైపోయింది. బ్లాక్ అండ్ వైట్ ఫొటోల కాలం నుంచి నేడు ఫోన్ ద్వారా సెల్ఫీ, డ్రోన్ కెమెరాల దశకు కెమెరా కన్ను విస్తరించింది. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా యానాం పరిసర ప్రాంతాల్లో క్లిక్‌మనిపించిన అందమైన చిత్రమాలికలివి..



గోదావరిలో నావల చెంత స్థానిక మత్స్యకారులు

నిందితులను కఠినంగా శిక్షించాలి



కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ ప్రతినిధులు



అమలాపురంలో నిరసనలో పాల్గొన్న క్రీడా సంఘాల ప్రతినిధులు

అమలాపురం టౌన్: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని మున్సిపల్ సర్క్యులర్ బజార్ ప్రాంగణంలో పలు క్రీడా సంఘాల ప్రతినిధులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. జిల్లా బాడీ బిల్డింగ్, జిల్లా పవర్ లిఫ్టింగ్, జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్లు సంయుక్తంగా ఈ నిరసన ప్రదర్శన నిర్వహించాయి. కార్యక్రమంలో జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు నగభేరి కృష్ణమూర్తి, కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, వెయిట్ లిఫ్టర్లు పిల్లి వందన వీరేంద్ర, యశ్వంత్ పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ప్రదర్శన

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ అమలాపురం గడియారం స్తంభం సెంటరులో యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా సంఘాలచే ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన జరిగింది. ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) ఈ నిరసనలో పాల్గొని ఘటనకు బాధ్యులైనవారిని తక్షణమే శిక్షించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెంకే వెంకటేశ్వరరావు, ఎంటీవీ సుబ్బారావు, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధి కారెం వెంకటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కె.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మానవహారం



లక్కవరంలో మానవహారంగా ఏర్పడ్డ విద్యార్థులు

మలికిపురం: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారాన్ని ఖండిస్తూ లక్కవరం గురయ్య ఇంటర్ మరియు డిగ్రీ కళాశాలల విద్యార్థులు ఆదివారం గ్రామంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. విద్యార్థిని ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. సంఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నల్ల బ్యాడ్జీలు ధరించి స్థానిక బట్టిలంక సెంటర్లో మానవహారం చేపట్టారు. కళాశాల కరస్పాండెంట్ మంగెన వెంకట సత్య ప్రసాద్ మాట్లాడుతూ ఇది అత్యంత హేయమైన చర్య న్నారు. ర్యాలీలో అకడమిక్ డైరెక్టర్ ఏబీ నాయుడు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.రాంబాబు, అరుణ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వేసవిని తలపిస్తున్న ఆగస్టు



గొల్లవిల్లిలో ఎండ వేడిమికి నిర్మానుష్యంగా మారిన రహదారి

ఉప్పలగుప్తం: వర్షాలతో చల్లగా ఉండాల్సిన వాతావరణం కాస్త భానుడి ప్రతాపంతో వేడెక్కుతోంది. ఫలితంగా ఆగస్టు నెలలో మరో వేసవిని తలపిస్తుంది. దీంతో ప్రజలు తీవ్ర ఉక్కపోతతో ఇళ్లకే పరిమితమవుతున్నారు. శ్రావణమాసం కావటంతో పెళ్లిళ్ల సీజన్, మరోవైపు శ్రావణ వత్రాలతో రద్దీగా రద్దీగా ఉండే రహదారులు సైతం ఎండ తాపానికి ఆదివారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారాయి. నిత్యం ప్రజలతో, వాహనాలతో రద్దీగా ఉండే సిరిపల్లి, మునిపల్లి ఆర్అండ్‌బీ రహదారిలో గొల్లవిల్లి సెంటర్ సైతం ఖాళీగా కనిపించింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆలమూరు: చొప్పెల్ల వద్ద 216 ఏ రహదారిపై కొండాలమ్మ వారి ఆలయం వద్ద జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అడబాల సత్యనారాయణ (45) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆలమూరు ఎస్సై ఎం,అశోక్ కథనం ప్రకారం ఈనెల 17న ఇటుక లోడుతో వెళుతున్న వ్యాన్ లారీ రోడ్డుపై రెండు ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్న ముగ్గురిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సత్యనారాయణ పరిస్థితి విషమించడంతో తొలుత రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమించడంతో కాకినాడ ఆస్పత్రికి తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈమేరకు ఎస్సై అశోక్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాపన్న గౌడ్ పోరాట పటిమ యువతకు ఆదర్శం



సభలో మాట్లాడుతున్న తెలంగాణ ఐజీ సత్యనారాయణగౌడ్

అమలాపురం రూరల్: బహుజనులకు ఆత్మగౌరవం దక్కాలంటే రాజ్యాధికారమే సాధనమని భావించి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చూపిన పోరాట పటిమ నేటి యువతకు ఆదర్శం కావాలని తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఐజీ వెలివెల సత్యనారాయణ గౌడ్ సూచించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా కోనసీమ గౌడ్ సంఘం ఆధ్వర్యంలో రూరల్ మండలం కామనగరువులో నూతనంగా నిర్మించిన పాపన్న గౌడ్ నిలువెత్తు విగ్రహాన్ని ఎంపీ గంటి హరీష్ మాథుర్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావులతో కలిసి ఐజీ సత్యనారాయణగౌడ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక సామాన్య కుటుంబంలో పుట్టి బహుజనుల కోసం పెత్తందారులను ఎదిరించి నిరంకుశత్వ పాలనన నుంచి విముక్తి కల్పించిన పాపన్నగౌడ్ చరిత్ర తెలుసుకుని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోనసీమ గౌడ్ సంఘం అధ్యక్షుడు రాజులపూడి వెంకటేశ్వరరావు(భీముడు), విశ్రాంతి డీఎస్పీ ఈడే అశోక్ కుమార్‌గౌడ్, మెట్ల రమణబాబు, పెచ్చెట్టి చంద్రమౌళి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, జయ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటన హేయం



యాళ్ల దొరబాబు

అల్లవరం: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటన హేయమైన చర్యని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు అన్నారు. బెండమూర్లంకలోని తన నివాసంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం శ్రమించే వైద్యులపై ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోవడం చాలా దారుణమన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడిన దోషులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైద్య విద్యార్థినికి జరిగిన అన్యాయంపై పోరాటం చేస్తున్న వైద్యులకు తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు.

ఘనంగా స్వామివారి మాస కల్యాణం

ఆత్రేయపురం: స్థానిక శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి మాస కల్యాణాన్ని ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పాలు, పుణ్యాహవచనం తదితర పూజాదికాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ పాతపాటి రమణరాజు ఆధ్వర్యంలో సిబ్బంది వినయ్, వెంకట్రాజు తదితరులు పర్యవేక్షించారు.